సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం ၊ 29 ၊ ఆగస్టు ၊ 2025



వణికిస్తున్న వరద గోదావరి

ఏలూరు జిల్లాను వరద గోదావరి వణికిస్తోంది. భారీ వర్షాలతో భద్రాచలం వద్ద నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది.

8లో ▸



రహదారులు.. నరకానికి నకళ్లు

ఏలూరులో ప్రధాన రహదారులన్నీ గోతులతో నిండిపోయాయి. భారీ వర్షాలతో నరకానికి నకళ్లుగా మారాయి.

8లో ▸



అదుపు తప్పి లారీ బోల్తా

చేపల లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా ఎనిమిది మందికి గాయాలయ్యాయి.

8లో ▸

న్యూస్‌రీల్

బాల్య వివాహాలను అరికట్టాలి



డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం అమీనాపేట సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ బాల్యవివాహాల విషయం ఎవరి దృష్టికైనా వస్తే 1098 లేదా 15100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యాదశలో వివాహాలు చేస్తే బాలికల ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతింటుందన్నారు. బాల్య వివాహాలు ఇష్టం లేని బాలికలను ప్రభుత్వ వసతి గృహాల్లో పునరావాసం కల్పించి వారికి విద్యా సౌకర్యాలు ఏర్పాటు చేస్తారని చెప్పారు. ప్యానల్ న్యాయవాది పి.వెంకటేశ్వరరావు, హాస్టల్ వార్డెన్ రాధాదేవి పాల్గొన్నారు.

పాలకొల్లులో అధిక వర్షపాతం

భీమవరం: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లాలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. గురువారం పాలకొల్లులో అత్యధికంగా 84.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భీమవరంలో 78.8, తాడేపల్లిగూడెంలో 45.2, పెంటపాడులో 37.4, తణుకులో 37.8, అత్తిలిలో 11.2, గణపవరంలో 30.2, ఆకివీడులో 20.2, ఉండిలో 24.6. పాలకోడేరులో 45.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పెనుమంట్రలో 33.4, ఇరగవరంలో 45.6, పెనుగొండలో 54.2. ఆచంటలో 31.6, వీరవాసరంలో 37.2, కాళ్లలో 32, పోడూరులో 36.4, మొగల్తూరులో 33.2, నరసాపురంలో 57.2, యలమంచిలిలో 33.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు సమాచార శాఖ ప్రకటనలో తెలిపింది.

పరిశ్రమలకు ప్రోత్సాహం

భీమవరం (ప్రకాశంచౌక్): సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అధికారులు కృషి చేయాలని జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఉద్యమ్ నమోదు అనేది కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఆన్‌లైన్ విధానం అన్నారు. జిల్లాలో సెప్టెంబర్ నెలాఖరు నాటికి 28 ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాపులు నిర్వహించాలన్నారు. జిల్లాస్థాయి నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు యూనిట్ల స్థాపన, పారిశ్రామిక పెట్టుబడులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

నేడు పోలవరానికి విదేశీ నిపుణుల బృందం రాక

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టులో నిర్మాణ పనులు పరిశీలించేందుకు విదేశీ నిపుణుల బృందం శుక్రవారం పోలవరం రానున్నారు. సెప్టెంబర్ 1వ తేదీ వరకు నిపుణుల బృందం పనులను పరిశీలించనుంది. ప్రాజెక్టు సీఈ కె.నరసింహమూర్తి, ఎస్ఈ రామచంద్రరావు విదేశీ నిపుణుల బృందం పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరుగుతున్న డయాఫ్రమ్‌వాల్ పనులు పరిశీలించి పలు సూచనలు ఇవ్వనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

వయోజన విద్య సూపర్‌వైజర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వయోజన విద్యాశాఖలో వయోజన విద్య సూపర్‌వైజర్ల ఉద్యోగాలకు ప్రభుత్వ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని వయోజన విద్యాశాఖ అధికారి జీసీహెచ్ ప్రభాకర్ ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీటీ, పీఈటీ, గ్రేడ్–2 లాంగ్వేజ్ పండిట్‌లు అర్హులని, కనీసం పదేళ్ల సర్వీసు ఉండాల న్నారు. గతంలో ఎంఎల్ఓ, ఎంఆర్‌పీ, ఎస్ఆర్‌జీ, డీఆర్‌జీ సభ్యులుగా చేసిన అనుభవం ఉండాలన్నారు. వచ్చేనెల 9న ఏలూరు కలెక్టరేట్ లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, వచ్చేనెల 5వ తేదీలోపు ఉప సంచాలకులు, వయోజన విద్య, ఏలూరు కార్యాలయానికి నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ప్రభాకర్ సూచించారు.

దూరవిద్య అభ్యర్థులకు అర్హత లేదనడం సరికాదు


ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఎస్సీ–2025 అభ్యర్థులు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్లూరి రామారావు, బి.రెడ్డిదొర ప్రకటనలో తెలిపారు. అర్హులైన కొందరికి కాల్ లెటర్లు రాలేదని, అలాంటి వారిలో పలు సందేహాలు ఉన్నాయని, వారికి సరైన సమాచారం లేదన్నారు. సెలెక్షన్ జాబితాను విడుదల చేసి కేటగిరీ వారీగా కటాఫ్‌ను ప్రకటించాలని, పూర్తి సమాచారం డీఈఓ కార్యాలయంలో ఉంచాలని డిమాండ్ చేశారు. దూరవిద్య ద్వారా చదివిన అభ్యర్థులకు డీఎస్సీకి అనుమతి ఇచ్చారని, ఇప్పుడు వారికి అర్హత లేదని చెప్పడం సరికాదన్నారు.

కలెక్టరేట్‌పై కూటమి హైడ్రామా

పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్ నిర్మాణం విషయంలో కూటమి నేతలు హైడ్రామాకు తెరతీశారు. పెదఅమిరంలో పీ–4 పద్ధతిలో కలెక్టరేట్ భవన నిర్మాణం చేయనున్నట్లు శాసనసభ డిప్యూటీ స్పీకర్, టీడీపీ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు చెబుతుండగా.. జిల్లా కేంద్రం భీమవరం దాటనివ్వనని భీమవరం జనసేన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అంటున్నారు. కొత్త ప్రతిపాదనలు చేస్తూ గందర**గోళం సృష్టిస్తున్నారు.**



- పెదఅమిరంలోనే నిర్మిస్తామంటున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు
- జిల్లా కేంద్రం భీమవరం దాటనివ్వనంటున్న ఎమ్మెల్యే పులపర్తి
- తాజాగా ఉండి నియోజకవర్గ పరిధిలో నిర్మాణానికి పావులు
- భీమవరంలో నిర్మించకుంటే ప్రజా ఉద్యమం తప్పదంటున్న వైఎస్సార్‌సీపీ
- కలెక్టరేట్ భవనానికి భీమవరంలో 20 ఎకరాలు కేటాయించిన గత ప్రభుత్వం



స్పష్టంగా వైఎస్సార్‌సీపీ

కలెక్టరేట్ **భవనాన్ని భీమవరం ఏఎంసీలోనే నిర్మించాలని పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ చినమిల్లి వెంకటరాయుడు, మహిళ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు** గూడూరి **ఉమాబాల తదితరులు స్పష్టం చేశారు. మరోపక్క భీమవరంలోనే నిర్మించాలని కోరుతూ** కాంగ్రెస్ **పార్టీ, ఇతర** ప్రజా **సంఘాల నేతలు ధర్నాలు చేశారు.**

సాక్షి, భీమవరం: భీమవరం కేంద్రంగా ఏర్పడిన నూతన పశ్చిమగోదావరి జిల్లాకు ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనం కోసం భీమవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) యార్డులో 20 ఎకరాల స్థలాన్ని గత ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ రికార్డుల్లో మార్పులు చేసి 2023 మార్చి 20న జీఓ నంబర్ 124ను విడుదల చేశారు. దాదాపు రూ.80 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవన నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖ టెండర్లు పిలిచింది. ఎన్నికల ప్రక్రియతో తాత్కాలికంగా బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం వచ్చింది. స్థలం కేటాయింపుపై గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ రద్దు కాలేదు, మంజూరు చేసిన నిధులు మరుగున పడిపోయాయి. ఏఎంసీలో 20 ఎకరాల స్థల కేటాయింపు విషయాన్ని మరుగునపెట్టి కూటమి ప్రజాప్రతినిధులు కొత్త ప్రతిపాదనలు తెచ్చారు. పరస్పర విరుద్ధంగా వారు చేస్తున్న ప్రకటనలు చర్చనీయాంశంగా మారాయి.

పెదఅమిరంలో అంటూ ఒకరు..

భీమవరం పక్కనే పెదఅమిరంలోని ఇరిగేషన్ శాఖకు చెందిన 3.6 ఎకరాల స్థలం ఉందని, మరికొంత స్థలం కోసం పక్క యజమానులతో చర్చిస్తున్నామని రెండురోజుల క్రితం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మీడియాకు వెల్లడించారు. పీ–4 పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనం నిర్మాణం చేయాలనుకున్నట్టు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ఇరిగేషన్, రెవెన్యూ తదితర శాఖల నుంచి అనుమతులు వచ్చాయని తదుపరి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అవసరమైతే సర్వే నంబర్ భీమవరంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

భీమవరం దాటనివ్వనని మరొకరు..

రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు స్పందించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనాన్ని భీమవరంలోనే నిర్మిస్తామన్నారు. అందుకోసం పట్టణంలో 25 ఎకరాల స్థల సేకరణ చేసేందుకు దిరుసుమర్రు, గొల్లవానితిప్ప, తాడేరులో అనువైన స్థలం కోసం చూస్తున్నట్టు చెప్పారు. కలెక్టరేట్ భవనానికి మూడు లేక నాలుగు ఎకరాల స్థలం సరిపోదంటూ కౌంటర్ ఇచ్చారు. భీమవరం పట్టణానికి చెందిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణలు కలెక్టరేట్ భవన నిర్మాణంపై ఇంకా ఏమీ మాట్లాడటం లేదు.

అంతటా అయోమయం

పెదఅమిరంలో నిర్మాణానికి అన్నీ అనుమ**తులు తెచ్చా**నని ఒకరు, భీమవరం దాటి వెళ్లని**వ్వనని మ**రొకరు చెబుతుండటం కూటమి పక్షా**లను ఆయో**మయానికి గురిచేస్తున్నాయి. ఏం **జరుగుతుం**దో తెలియని గందరగోళ పరిస్థితు**లు నెలకొ**న్నాయని ఆయా పార్టీల నేతలే చర్చిం**చుకుంటు**న్నారు. అనవసర రాద్ధాంతంతో ప్రజ**ల్లో చులక**నవుతున్నామని మదనపడుతున్నారు. ఇదిలా ఉండగా ప్రజలకు అనువుగా ఉండే ఏఎంసీ స్థలాన్ని పక్కనపెట్టి కొత్త ప్రతిపాదనలు చేయాల్సిన అవసరం ఏముందని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి భీమవరం ఏఎంసీకి రోడ్డు సదుపాయం ఉందని, పట్టణంలోకి రావాల్సిన అవసరం లేకుండా బైపాస్ రోడ్డు మీదుగా నేరుగా కలెక్టరేట్‌కు చేరుకునే వీలుందంటున్నారు. దీని వలన పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని సూచిస్తున్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు



భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కలెక్టరేట్ నిర్మాణంలో రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) తీరు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఉందని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు మండిపడ్డారు. గురువారం భీమవరంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రజలకు ప్రభుత్వ పాలన మరింత చేరువ చేయడానికి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల పునర్విభజన చేసి పశ్చిమగోదావరి జిల్లాకు భీమవరాన్ని ప్రధాన కేంద్రంగా ప్రకటించడమే గాక అన్ని ప్రభుత్వ కార్యాలయాలూ ఒకేచోట ఉండే విధంగా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంతంలో 20 ఎకరాల స్థలం కేటాయించారని, దీంతో పాటు రూ.100 కోట్ల నిధులు మంజూరుచేశారని గుర్తు చేశారు. కలెక్టరేట్ భవనాల నిర్మాణానికి టెండర్లు కూడా పిలిచిన తరుణంలో ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా కలెక్టరేట్ నిర్మాణానికి ఎటువంటి చర్యలూ తీసుకోకపోగా టీడీపీకి చెందిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు కలెక్టరేట్‌ను ఉండి నియోజకవర్గానికి తరలించుకుపోడానికి ప్రయత్నాలు చేస్తుంటే జనసేన పార్టీకి చెందిన భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు చేష్టలుడిగి చూస్తున్నారని మండిపడ్డారు. భీమవరంలో స్థలాలు లేవంటూ రఘురామకృష్ణరాజు, భీమవరంలోనే కలెక్టరేట్ ఉంటుందని అంజిబాబు ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ వివాదాస్పదం చేస్తున్నారని మోషేన్‌రాజు దుయ్యబట్టారు. భీమవరంలోని ఏఎంసీ, ప్రస్తుతం కలెక్టరేట్ ఉన్న ఏరియా, తాలూకాఫీసు ప్రాంతంలో అనువైన ప్రభుత్వ భూములున్నాయని, ప్రజలకు ఎంతో అనువైన ప్రాంతాన్ని కాదని భీమవరంలో స్థలాలు లేవని రఘురామకృష్ణరాజు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కలెక్టరేట్‌ను ఉండిలో నిర్మించాలని మిమ్మల్ని ఎవరు కోరారని ప్రశ్నించారు. ప్రజల సహకారంతో కలెక్టరేట్ భవనాల నిర్మాణమంటున్న రఘురామకృష్ణరాజు గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఏమయ్యాయో చెప్పాలని నిలదీశారు. గత ప్రభుత్వంలో కలెక్టరేట్ నిర్మాణానికి ఇచ్చిన జీఓ 124 రద్దు కాలేదని గుర్తుచేశారు. డబ్బు, పలుకుబడి ఉందని భీమవరం నుంచి కలెక్టరేట్‌ను తీసుకుపోతామంటే కుదరదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఎంతో ప్రత్యేకత కలిగిన భీమవరం పట్టణాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దడానికి సహకరించాలని కోరారు. పెద అమిరంలో చూపుతున్న ఇరిగేషన్ భూమిలో ప్రభుత్వ భవనాలు కట్టాలంటే సుప్రీంకోర్టు అనుమతి తీసుకుని కేబినెట్ తీర్మానం చేయాలనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఇప్పటికైనా భీమవరం ప్రజల ఆత్మగౌరవాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే అంజిబాబు గౌరవించి భీమవరంలోనే కలెక్టరేట్ భవనాలు నిర్మించాలని, లేకుంటే ప్రజా ఉద్యమం తప్పదని మోషేన్‌రాజు హెచ్చరించారు.

మరో విద్యుత్ ఉద్యమం తప్పదు



కాళ్లలో నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం/కాళ్ల: గతంలో తెలుగుదేశం ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యమం సాగిందని, మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక విద్యుత్ ఉద్యమం తప్పనిసరిగా మారిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.బలరాం అన్నారు. గురువారం పట్టణంలోని ప్రకాశం చౌక్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో నాటి విద్యుత్ ఉద్యమ అమరవీరులను స్మరించుకుంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఇంధన, ట్రూఅప్ చార్జీల పేరుతో భారాలు మోపడం దారుణమన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఎంసీపీఐ నాయకుడు జి.రాంబాబు, ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు డి.శ్రీనివాసరాజు, సీపీఎం నాయకులు ఎం.నాయకులు, బి వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో.. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, లేకుంటే పోరాటం తప్పదని సీపీఎం నాయకులు హెచ్చరించారు. గురువారం కాళ్లలోని పార్టీ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ కరెంట్ చార్జీలు తగ్గించాలని, 25 ఏళ్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే మరో బషీర్‌బాగ్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సీపీఎం నాయకులు మండా సూరిబాబు, తిరుమాని శ్రీను, తులా వెంకటేశ్వరరావు, బాతు రామస్వామి, బోదనపు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ సెలెక్షన్ జాబితా విడుదల చేయాలి

భీమవరం: డీఎస్సీలో అర్హత సాధించిన వారి సెలెక్షన్ జాబితాను, కేటగిరీ వారీగా కటాఫ్ మార్కులను విడుదల చేయాలని ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి గురువారం ఓ ప్రకటనలో కోరారు. 2025 డీఎస్సీకి సంబంధించి అర్హత పొందిన అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో కాల్ లెటర్లు పంపడం వల్ల, కొందరు అర్హత సాధించినా కాల్ లెటర్లు రాలేదనే అపోహలు ఉన్నాయన్నారు. ప్రధానంగా డీఎస్సీ అభ్యర్థుల గందరగోళాన్ని నివారించడానికి సెలెక్షన్ జాబితా విడుదల చేస్తూ కేటగిరీ వారిగా కటాఫ్ మార్కులను విడుదల చేయాలన్నారు. దూరవిద్య అభ్యసించిన వారికి డీఎస్సీ రాయడానికి అనుమతి ఇచ్చారని అయితే సెలెక్ట్ అయ్యేసరికి వారికి అర్హత లేదని చెప్పడం సరికాదని వారిని కూడా సెలెక్షన్ లిస్ట్‌లో చేర్చాలని గోపిమూర్తి డిమాండ్ చేశారు.

సజ్జాపురంలో పారిశుద్ధ్య పనులు



డ్రెయిన్‌లో పూడిక తొలగించిన దృశ్యం

సాక్షి స్పందన

తణుకు అర్బన్: 'సజ్జాపురం.. సమస్యలతో సతమతం' శీర్షికన 'సాక్షి'లో ఈనెల 26న ప్రచురించిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. శానిటరీ అధికారులు పర్యవేక్షించి రోడ్డు మార్జిన్‌లోని పిచ్చిమొక్కలు, డ్రెయినేజీలో పూడిక తొలగింపు పనులు చేపట్టారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్‌ఓబీ, ఆర్‌యూబీలకు ప్రాధాన్యం



పరిశీలిస్తున్న రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శ్రీనివాస్

ఆకివీడు: రైల్వే గేట్ల ప్రమేయం లేకుండా ఆర్‌ఓబీ, ఆర్‌యూబీలకే ప్రాధాన్యమిస్తున్నామని విజయవాడ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఆకివీడు స్టేషన్ సమీపంలోని దుంపగడప గేటు, సిద్ధాపురం గేటులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దుంపగడప గ్రామంలోని గేటు వద్ద, గుమ్ములూరు వెళ్లే రోడ్డులోని గేటు వద్ద ఆర్‌ఓబీలు, రైల్వేస్టేషన్‌కు ఇరువైపులా ఉన్న గేట్ల స్థానంలో అండర్ బ్రిడ్జిల నిర్మాణాలకు అవకాశం ఉందన్నారు. అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.25 కోట్లు, ఆర్‌ఓబీకి రూ.70 కోట్లు వ్యయమవుతుందన్నారు. నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివారరెడ్డి, కౌన్సిలర్ గేదల అప్పారావు మాట్లాడుతూ ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణాలకు గతంలోనే నగర పంచాయతీ తీర్మానం చేసిందని, అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమయ్యే స్థల సేకరణకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. గేట్లతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ డీఈ సీహెచ్‌టీవీఎస్ ప్రసాద్, జేఈ శ్రీహరి, ఆర్ఐ ఆంజనేయులు వైఎస్సార్‌సీపీ నేత బొక్కా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కుంగిన లాల్వ డ్రెయిన్ వంతెన



లాల్వ డ్రెయిన్ రోడ్డుకు పడిన గుంత

కలిదిండి(కైకలూరు): భారీవర్షాలకు డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. కైకలూరు నుంచి కలిదిండి మార్గంలో కలిదిండి ప్రారంభంలో లాల్వ డ్రెయిన్ వంతెన శిథిలావస్థకు చేరడంతో సమీపంలో డ్రెయిన్‌పై తూములు ఏర్పాటు చేసి తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి ఒక్కసారిగా వంతెన కుంగి భారీ గుంత ఏర్పడింది. దీంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన కుంగడంతో కైకలూరు చేరుకోవాలంటే కోరుకొల్లు, వేమవరప్పాడు మీదుగా చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. పంచాయతీ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వంతెన కుంగడంతోప్రజలు ఆందోళన చెందుతున్నారు.

● మూషిక విన్యాసం.. భక్తి పారవశ్యం



గణనాథుడి చెంత మూషిక రాజు (ఎలుక) విన్యాసాలు అబ్బురపరిచాయి. జంగారెడ్డిగూడెం కోర్టు సమీపంలోని సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి ఇంట్లో చవితి నాడు మందిరం పక్కన ఉంచిన పసుపు వినాయకుడి ప్రతిమ వద్దకు ఓ మూషికం వచ్చింది. సుమారు రెండు గంటలకు పైగా అక్కడే ఉండి విన్యాసాలు చేసింది. మంచినీరు తాగి ఫలహారాలు ఆరగించింది. ఇదంతా వినాయకుడి మహిమగా భక్తులు చెబుతున్నారు.

– జంగారెడ్డిగూడెం

గోప్యంగా డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్



ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన అభ్యర్థులు



డీఈఓ వెంకట లక్ష్మమ్మకు సమస్యలు తెలియజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఎస్సీ–2025 క్వాలిఫైడ్ అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను జిల్లా విద్యాశాఖాధికారి అత్యంత గోప్యంగా నిర్వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను గురువారం స్థానిక సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టారు. ఉదయం 10 గంటలకు ప్రాంభం కావాల్సిన వెరిఫికేషన్ ప్రక్రియ 11 గంటలు దాటిన తరువాత ప్రారంభించారు. అయితే ఈ కార్యక్రమాన్ని అత్యంత గోప్యంగా నిర్వహించడానికి జిల్లా విద్యాశాఖాధికారి విశ్వ ప్రయత్నం చేశారు. కనీసం మీడియా ప్రతినిధులను కూడా అనుమతించకపోవడంతో మీడియా ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాల్సి వచ్చింది. ఎస్టీ కేటగిరీకి సోషల్ స్టడీస్‌లో జిల్లాలో 7 పోస్టులు మంజూరు కాగా కేవలం ఆరుగురు అభ్యర్థులకు మాత్రమే కాల్ లెటర్లు పంపడం వెనుక అంతర్యమేంటని కొన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రశ్నించారు. రాష్ట్రస్థాయిలో డీఎస్సీ పరీక్షల్లో సోషల్ స్టడీస్‌లో కామన్ ర్యాంకు 524గాను, ఎస్టీ కేటగిరీలో లోకల్ అభ్యర్థుల్లో 7వ స్థానం పొందిన భూక్యా నాగరాజు అనే అభ్యర్థికి కాల్ లెటర్ జారీ చేయకుండా పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. ఎన్నడూ లేనివిధంగా కేటగిరీ వారీగా కటాఫ్ మార్కులను విడుదల చేయకుండా సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేపట్టడంతో నియామకాలపై అభ్యర్థుల్లో సందేహాలు తలెత్తుతున్నాయి. కాగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభించిన తర్వాత సర్వర్లు మొరాయించడంతో ఈ ప్రక్రియ ఆలస్యంగా కొనసాగుతోంది. తొలి రోజు మొత్తం 804 మందిని ఆహ్వానించగా రాత్రి 9 గంటల కూడా 70 శాతానికిలోపు వెరిఫికేషన్ జరిగినట్టు చెబుతున్నారు. చంటి పిల్లలతో వచ్చిన మహిళా అభ్యర్థులు అవస్థలు పడ్డారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మను వివరణ కోసం ప్రయత్నించగా ఆమె స్పందించ లేదు.

వణికిస్తున్న వరద గోదావరి

- మళ్లీ నీట మునిగిన ఎద్దెల వాగు వంతెన
- 18 గ్రామాలకు నిలిచిన రాకపోకలు


వేలేరుపాడు: ఎద్దేల వాగు నీట మునగడంతో పడవపై ప్రయాణిస్తున్న గిరిజనులు


ఏలూరు (టూటౌన్): తంగెళ్లమూడి వంతెన వద్ద తమ్మిలేరు ఉధృతి

వేలేరుపాడు: ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలాన్ని వరద గోదావరి వణికిస్తోంది గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత, ఇంద్రావతి పొంగి ప్రవహిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు వైపు నుంచి వరద నీటిని విడుదల చేశారు. దీనికి తోడు సమ్మక్క సారక్క ప్రాజెక్టు పొంగి ప్రవహిస్తోంది. ఫలితంగా భద్రాచలం వద్ద గోదారి నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. గురువారం రాత్రి వరద నీటిమట్టం 39 అడుగులకు పెరగటంతో వేలేరుపాడు మండలంలోని ఎద్దుల వాగు వంతెన ఈ నెలలో మూడోసారి నీట మునిగింది. దీంతో దిగువ ప్రాంతంలోని 18 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని కోయిదా, కట్కూరు, సిద్ధారం, కాచారం, పూసుకుంది, తాళ్లగొంది, పేరంటపల్లి, టేకుపల్లి, టేకూరు, బుర్రెడ్డిగూడెం, ఎర్రమెట్ట, యడవల్లి, చిట్టం రెడ్డిపాలెం, మరో ఐదు గ్రామాలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. ఎద్దెల వాగు వద్ద అధికారులు నాటు పడవను ఏర్పాటు చేశారు. దీనిపైన ఆ గ్రామాల గిరిజనులు రాకపోకలు సాగిస్తున్నారు.

ఉధృతంగా తమ్మిలేరు

ఏలూరు (టూటౌన్): ఏలూరు తంగెళ్లమూడి వంతెన వద్ద తమ్మిలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గత రెండు రోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలకు తమ్మిలేరుకు నీటి ప్రవాహం పెరిగింది. ఏలూరుకు ఇరువైపులా ఉన్న తమ్మిలేరు నీటి ప్రవాహంతో కళకళ లాడుతుంది. మరోవైపు తమ్మిలేరులో నీటి ప్రవాహం క్రమేపీ పెరుగుతుండటంతో ఏలూరు తూర్పు, పడమర లాకుల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. వర్షాలు ఇదే విధంగా మరికొన్ని రోజులు కొనసాగితే తమ్మిలేరుకు వరద ప్రమాదం పొంచి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు సైతం తమ్మిలేరు ఏటిగట్టు వెంబడి అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

నిండుకుండలా కేకేఎం ఎర్రకాలువ జలాశయం


కొంగువారిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయం వద్ద పెరుగుతున్న నీటిమట్టం

జంగారెడ్డిగూడెం: కొండప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో మండలంలోని కొంగువారిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయం నిండుకుండలా మారింది. ప్రాజెక్టులోకి 400 క్యూసెక్కుల వరదనీరు చేరుతోందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 83.50 మీటర్లు కాగా, ప్రస్తుతం 81.52 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. ప్రాజెక్టు పూర్తి నిల్వ సామర్థ్యం 4,428 టీఎంసీలు.

భద్రతా చర్యలు చేపట్టాలి

వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా 3వ రోజు నుంచి నిమజ్జన కార్యక్రమాలు జరుగుతాయి. జంగారెడ్డిగూడెంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి కేకేఎం ఎర్రకాలువ జలాశయంలో గణనాథులను నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు తీసుకువస్తుంటారు. ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీటిమట్టం దృష్టా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పోలీసులు, రెవెన్యూ అధికారులు నిమజ్జన కార్యక్రమాలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మెట్టలో భారీ వర్షాలు


ఖమ్మం జిల్లా బేతుపల్లి అలుగు నుంచి ఆంధ్రా కాల్వకు ప్రవహిస్తున్న వరద నీరు


చింతలపూడి కొత్త బస్టాండ్ ముందు ప్రవహిస్తున్న వరద నీరు

చింతలపూడి: అల్పపీడన ప్రభావంతో మెట్ట ప్రాంతంలో భారీ వర్షాలు పడుతున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులు అలుగులు పడి వరద నీరు రోడ్లపై నుంచి ప్రవహిస్తోంది. ముఖ్యంగా జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు తమ్మిలేరు ప్రాజెక్టు నీటి మట్టం గరిష్ట స్థాయికి చేరుకుంటోంది.

తమ్మిలేరుకు వరద

జిల్లాలో కురుస్తున్న వర్షాలకు తోడు ఖమ్మం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు తమ్మిలేరు రిజర్వాయర్ నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. ఖమ్మం జిల్లా, బేతుపల్లి రిజర్వాయర్‌కు అలుగు పడటంతో తమ్మిలేరు రిజర్వాయర్‌కు గురువారం వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టు వద్దే మకాం వేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 341.98 అడుగులకు చేరుకుంది. గోనెల వాగు స్టోరేజ్ ట్యాంక్ నీటిమట్టం 341 అడుగులకు చేరుకుందని తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ లాజరు తెలిపారు. ప్రస్తుతం ఖమ్మంజిల్లా, సత్తుపల్లి మండలం బేతుపల్లి అలుగు పై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో గంటకు 500 క్యూసెక్కులకు పైగా వరద నీరు ఆంధ్రా కాల్వ ద్వారా ప్రాజెక్టులోకి వస్తుందన్నారు. ప్రాజెక్టులో 350 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చునని అధికారులు చెప్పారు. ప్రాజెక్టు నీటిమట్టం 348 అడుగులకు చేరుకున్నాక వరద పరిస్థితిని అంచనా వేసి ప్రధాన గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తామని తెలిపారు.

ఏజెన్సీలో పొంగిన వాగులు


కేఆర్‌పురం వద్ద వాగు పొంగుతున్న దృశ్యం

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీలో వాగులు పొంగుతున్నాయి. బుధవారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. వినాయకచవితి వేడుకలు ప్రారంభం కావడంతో వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొండప్రాంతంలో భారీగా వర్షం కురవడంతో వాగులు పొంగిపొర్లాయి. కేఆర్‌పురం సమీపంలో ఉన్న వాగు సుమారు 2 గంటలపాటు పొంగిపొర్లింది. గురువారం తెల్లవారుజామున కూడా భారీ వర్షం కురిసింది. తరువాత కాస్త శాంతించినా మళ్లీ సాయంత్రం నుంచి వర్షం కురుస్తూనే ఉంది.

పాఠశాలను ముంచెత్తిన వరదనీరు


కలరాయనగూడెం హైస్కూల్‌లో వరద నీరు

లింగపాలెం: కుండపోతగా కురిసిన వానంతో లింగపాలెం మండలంలోని కొండవాగులు పొంగి గ్రామాల్లోకి వరదనీరు చేరుతోంది. కలరాయనగూడెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లోకి వరద నీరు ప్రవేశించింది. నీరు బయటకు పోవడానికి కనీసం డ్రెయిన్ సౌకర్యం కూడా లేదు. ఫలితంగా పాఠశాల వర్షంలో నానుతోంది. పాఠశాలలో వరద నీరు చేరినా నాయకులెవరూ ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. భారీ వర్షం కారణంగా జిల్లా అధికారులు ముందుగానే గురువారం సెలవు ప్రకటించారు. చుట్టుపక్కల ఆక్రమణల కారణంగా వరద నీరు బయటకు వెళ్లే దారి లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే జేసీబీతో తాత్కాలిక డ్రెయిన్ తీయించి, ఆక్రమణలు ఖాళీ చేయించి శాశ్వతంగా సీసీ డ్రెయిన్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం



నిట్టా గంగరాజు, సింహాద్రి మోహన్‌చంద్

దెందులూరు: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా దెందులూరు మండలం జోగన్నపాలెం గ్రామానికి చెందిన నిట్టా గంగరాజు, స్టూడెంట్ వింగ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా పెదవేగి మండలం వంగూరు గ్రామానికి చెందిన సింహాద్రి మోహన్‌చంద్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర కార్యదర్శులుగా నియమితులైన ఇద్దరికీ దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి శుభాకాంక్షలు తెలిపారు.

వేల్పుచర్లలో డెంగీ జ్వరాలు


వైద్య శిబిరం నిర్వహిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్

ముసునూరు : కొద్ది రోజులుగా వేల్పుచర్లలో జ్వరాలు విజృంభిస్తుండడంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. జ్వరాల బారిన పడిన కొందరు ఏలూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లగా నలుగురు చిన్నారులకు డెంగీ వ్యాధి సోకినట్లు నిర్ధారణ కావడంతో అక్కడే చేరి, చికిత్స పొందుతున్నారు. ఇద్దరికి నయం కావడంతో డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్నారు. మరో ఇద్దరు చిన్నారులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షకీనా ఇవాంజిలిన్ ఆధ్వర్యంలో గురువారం వేల్పుచర్లలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, ఇంటింటా జ్వరాల సర్వే నిర్వహిస్తున్నారు. సూపర్‌వైజర్ మురళీమోహన్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్ట్ అంటూ వైద్యురాలికి బెదిరింపులు

జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన ఒక వైద్యురాలిని డిజిటల్ అరెస్టు అంటూ సైబర్ నేరస్తులు గురువారం బెదిరింపులకు గురిచేశారు. పట్టణానికి చెందిన డాక్టర్ సునీత కొవ్వూరు సీహెచ్‌సీలో పనిచేస్తున్నారు. గురువారం ఆమె ఇంట్లో ఉండగా, కర్ణాటక టెలికాం అథారిటీ నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ ఫోన్ ద్వారా అనైతిక కాల్స్ చేస్తూ, ఫొటోలు పంపుతున్నందున బెంగుళూరులోని గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని బెదిరించారు. మూడేళ్ల జైలు, రూ.2 లక్షల జరిమానా కట్టాల్సి ఉంటుందని, బెంగుళూరు రావాలని ఫోన్‌లో గద్దించారు. తరువాత మరో నెంబర్ నుంచి గాంధీ నగర్ పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామంటూ వీడియో కాల్ చేశారు. దీంతో అప్రమత్తమైన సునీత సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మహిళపై లైంగిక దాడికి యత్నం

ముదినేపల్లి రూరల్: వివాహిత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మండలంలోని బొమ్మినంపాడుకు చెందిన వివాహిత తన చెరువును ఈడేపల్లి గ్రామానికి చెందిన నాగబాబుకు లీజుకు ఇచ్చింది. నాగబాబు తరచూ ఆమె ఇంటికి వెళుతూ అసభ్యంగా ప్రవర్తించేవాడు. వివాహిత ఒంటరిగా ఉన్న సమయంలో లైంగిక దాడికి యత్నించగా ఆమె ప్రతిఘటించి కేకలు వేయడంతో పారిపోయాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అదుపు తప్పి చేపల లారీ బోల్తా

ఒకరు మృతి, 8 మందికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో మృతి చెందిన సద్దాం హుస్సేన్


ఏలూరులో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

దెందులూరు: జాతీయ రహదారి దెందులూరు మండలం సత్యనారాయణపురం - కొమురేపల్లి గ్రామాల మధ్య చేపల లారీ అదుపు తప్పి బోల్తా పడి ఘటనలో ఒకరు మృతి చెందగా ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వివరాల ప్రకారం బుధవారం గుడివాడ నుండి చేపల లోడుతో నారాయణపురం వైపు చేపల లారీ బయలుదేరింది. లారీ క్యాబిన్‌లో డ్రైవర్, క్లీనర్, గుమాస్తా ఉండగా, చేపల లోడుపై 9 మంది బీహార్‌కు చెందిన కూలీలు ప్రయాణిస్తున్నారు. లారీ దెందులూరు మండలం సత్యనారాయణపురం - కొమురేపల్లి గ్రామాల మధ్యకు వచ్చేసరికి ముందు వెళుతున్న కారు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ చేయడంతో లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బీహార్‌కు చెందిన సద్దాం హుస్సేన్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వీరు కూలి పనుల నిమిత్తం బీహార్ నుంచి వచ్చి ఉంగుటూరులో నివసిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే రోడ్డు సేఫ్టీ, పోలీస్ సిబ్బంది, హోంగార్డు యూనస్, కానిస్టేబుల్ ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పోలీస్ వాహనంలోనే ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో నలుగురికి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు.

వికలాంగుల పింఛన్లు తొలగించడం దారుణం

భీమవరం: వివిధ ప్రతిభావంతుల శాశ్వత సదరం సర్టిఫికెట్లలో వైకల్య శాతం కుదించి పింఛన్లు తొలగిస్తూ జారీ చేసిన నోటీసులు ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని వికలాంగులల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అల్లాడి నటరాజు, జిల్లా అధ్యక్షుడు మద్దాల శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐక్య రాజ్య సమితి ఒప్పందం ప్రకారం వివిధ దేశాల్లో వైకల్యం గల వ్యక్తుల హక్కుల చట్టం -2016 అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించి శాశ్వత వైకల్యం గల వ్యక్తులకు విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగం వంటివి శాశ్వత ప్రాతిపదికన అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అరకొరగా ఇస్తున్న పింఛన్లకు కూడా సాకులు వెతుకుతూ రీ-అసెస్మెంట్ పేరుతో శాశ్వత సదరం సర్టిఫికెట్లలో వైకల్య శాతాలను తగ్గించి పింఛన్లలో కోతలు విధించడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వికలాంగులందరికీ పూర్తిస్థాయిలో పింఛన్లు పంపిణీ చేయాలని నటరాజు, శ్రీనివాస్ కోరారు.

రహదారులు.. నరకానికి నకళ్లు


ప్రమాదకరంగా సత్యనారాయణ థియేటర్ రోడ్డు


గోతులమయంగా బెనర్జీపేట మెయిన్ రోడ్డు

ఏలూరు నగరంలో ప్రధాన రహదారులన్నీ ఎక్కడ చూసినా గోతులమయం. ఈ రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయి. దీనికితోడు గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గోతుల్లో వర్షపునీరు నిలిచిపోయి లోతు తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఓట్లు వేస్తే రోడ్లు వేస్తామని మైక్ పట్టుకుని ఉపన్యాసం ఇచ్చిన కూటమి నాయకులు ఇప్పుడు ఏమైపోయారంటూ ప్రజలు బహిరంగంగానే తిట్టుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు


ఏలూరు విజయలక్ష్మి థియేటర్ సెంటర్‌లో రోడ్డు దుస్థితి


బుద్ధా పార్కు వద్ద పెద్ద గొయ్యి ఇది


వంగాయగూడెం సెంటర్‌లో ఇలా..


అధ్వానంగా కైకలూరు బైపాస్ సెంటర్

సాక్షి క్లాసిఫైడ్స్

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఎస్టీ అభ్యర్థికి కాల్ లెటర్ జారీ చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఎస్సీ - 2025 ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని సోషల్ స్టడీస్‌లో ఎస్టీ కేటగిరీలో 7 పోస్టులు ప్రకటించారని, కానీ ఆరుగురు అభ్యర్థులకు మాత్రమే కాల్ లెటర్లు పంపారని, మిగిలిన పోస్టుకు అర్హుడైన అభ్యర్థికి వెంటనే కాల్ లెటర్ జారీ చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ గుగ్గులోతు కృష్ణ కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంటకలక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో సోషల్ స్టడీస్‌లో మొత్తం 7 పోస్టులు చూపగా వాటిలో 6 జిల్లా పరిషత్ యాజమాన్యంలోను, ఒక పోస్టు మున్సిపల్ యాజమాన్యంలోనూ చూపారన్నారు. ఎంపికైన అభ్యర్థుల్లో ఆరుగురికి మాత్రమే కాల్ లెటర్లు పంపారని, డీఎస్సీ పరీక్షల్లో సోషల్ స్టడీస్‌లో కామన్ ర్యాంకు 524 గాను, ఎస్టీ కేటగిరీలో లోకల్ అభ్యర్థుల్లో 7వ స్థానం పొందిన భూక్యా నాగరాజు అనే అభ్యర్థికి కాల్ లెటర్ జారీ చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. 7వ పోస్టుకు సంబంధించి నాగరాజుకు వెరిఫికేషన్ కాల్ లెటర్ జారీ చేయాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి


దుర్గాభవాని మృతదేహం

కొయ్యలగూడెం: విద్యుత్ షాక్‌తో ఓ మహిళ మృతి చెందింది. ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్‌టీఆర్ నగర్‌లో అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తున్న ఉమ్మడిశెట్టి దుర్గాభవాని (54) బుధవారం మధ్యాహ్నం తన ఇంటి వద్ద బకెట్లో ఉన్న వాటర్ హీటర్ తీస్తుండగా విద్యుత్ షాక్‌కి గురై కుప్పకూలిపోయింది. స్థానికులు వచ్చి డాక్టర్ సహాయంతో పరిశీలించేసరికే అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆమెకు భర్త, పిల్లలు లేకపోవడంతో బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

క్షేత్రంలో మోటార్‌సైకిళ్ల దొంగ అరెస్ట్


ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్ ఆవరణలో నిందితుడిని, బైక్‌లను చూపుతున్న సీఐ విల్సన్, ఎస్సై సుధీర్

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం పరిసర ప్రాంతాల్లో బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భీమడోలు సీఐ యూజే విల్సన్, ఎస్సై టి.సుధీర్‌లు గురువారం వెల్లడించారు. చాట్రాయి మండలం పోలవరం గ్రామానికి చెందిన కోట రవి ద్వారకాతిరుమల క్షేత్రానికి వచ్చిన భక్తుల బైక్‌లను ఇటీవల వరుసగా చోరీ చేశాడు. వీటిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు పర్యవేక్షణలో, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ కుమార్ ఆధ్వర్యంలో భీమడోలు సీఐ యూజే విల్సన్, ఎస్సై టి.సుధీర్, సిబ్బంది సీహెచ్ లక్ష్మీనారాయణ, వీజే ప్రకాష్ బాబు బృందంగా ఏర్పడి దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో నిందితుడు రవిని ద్వారకాతిరుమల నుంచి వెంకటకృష్ణాపురం వెళ్లే రోడ్డులో బుధవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం అతడి నుంచి 4 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కోడి పందేలు, పేకాట వంటి వ్యసనాలకు బానిసై ఈ చోరీలకు పాల్పడుతున్నాడని సీఐ విల్సన్ తెలిపారు. ఇతడిపై గతంలో ఏలూరు టూటౌన్, చాట్రాయి పోలీస్‌స్టేషన్లలో మోటార్ సైకిల్ చోరీ కేసులు నమోదు అయ్యాయని, జైలుకు కూడా వెళ్లి వచ్చినట్టు విచారణలో తేలిందన్నారు.

క్లుప్తంగా

జగన్నాథపురంలో కేంద్ర బృందం పర్యటన



జగన్నాథపురం ఎస్‌డబ్ల్యూఎం షెడ్డును పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో స్వచ్ఛభారత్ కేంద్ర బృందం గురువారం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, ఇంటింటికి చెత్త సేకరణ, తడి, పొడి చెత్త విభజన వంటి అంశాలను బృందం ఇన్‌చార్జ్ మధుమతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, పంచాయతీ కార్యదర్శి బాలగోపాల శ్రీనివాస చంద్రరాజు, ఎంఆర్‌సీ ఎం. రవికిరణ్, వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



జగన్నాథపురం గ్రామంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

తాడేపల్లిగూడెం రూరల్: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో పీసీపీఎన్‌టీ యాక్ట్-1994, పీఎంఎంవీవైపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ఆడపిల్లల సంఖ్యను పెంచడానికి, వారిని ప్రోత్సహించడానికి, ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పుల శాతాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద దఫదఫాలుగా తల్లుల ఖాతాకు జమ చేస్తుందన్నారు. ఆడపిల్లల్ని పుట్టనివ్వాలని, ఎదగనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం శాంత కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ సత్యవాణి, ఆశా వర్కర్ కనక దుర్గ, వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు ఎ.తులసీరాణి, పి.అంజికుమారి, టి.రామలక్ష్మి, ఎం.శాంతకుమారి, గీత తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ విశాలాక్షి

తాడేపల్లిగూడెం అర్బన్ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విశాలాక్షి అన్నారు. స్థానిక 24వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు ప్రధాన మంత్రి మాతృవందన యోజన పథకంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలకు 18, మగ పిల్లలకు 21సంవత్సరాలు పూర్తికాకుండా పెళ్లి చేస్తే రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడికి పూజలు



తణుకు అర్బన్ : రుషి పంచమి సందర్భంగా తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శ్రీకృష్ణభగవానుడికి పూజాదికాలు నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, నేతలు బలరామకృష్ణ, జగదీష్, చింతన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

యలమంచిలి: ఆచంట మండలం వల్లూరు శివారు ఎంపీ పాలెం హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు గురువారం పాలకొల్లు వాకర్స్ క్లబ్ తరపున క్లబ్ అధ్యక్షులు తట్టపర్తి సుధాకర్‌రావు పాఠ్య పుస్తకాలు అందించారు. రూ. 30 వేలు విలువ చేసే కొత్త సబ్జెక్టు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే ఏకైక మార్గం చదువేనన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, సభ్యులు సోమంచి శ్రీనివాసశాస్త్రి, జవ్వాజి కళ్యాణ్, కేశిరాజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తత అవసరం

- పరిశుభ్రతతో వ్యాధులు దూరం
- పిల్లల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి



ఇరగవరంలో పాఠశాల ఆవరణలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)



రేలంగిలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

ఇరగవరం: ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అడపాదడపా వర్షాలు పడడం, ముసురు పట్టి చినుకులు పడుతూనే ఉన్నాయి. చిరుజల్లుల్లో తడవడానికి చిన్నారులు సరదా పడుతుంటారు. కానీ ఆ సరదా మాటున ఎన్నో వ్యాధులు పొంచి ఉన్నాయన్న విషయం వారికి తెలియదు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యం పట్ల చాలా శ్రద్ధ తీసుకోవాలి. సాధారణంగా ప్రాథమిక స్థాయి విద్యనభ్యసించే చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఈ వయస్సులో వారు వర్షంలో తడవడం, రోడ్లపై నిల్వ ఉన్న నీటిలో ఆటలాడటం చేస్తుంటారు. దీనికి తోడు రోడ్డు పక్కన, స్కూల్ బయట విక్రయించే చిరుతిళ్ల తినడంపై ఆసక్తి చూపిస్తుంటారు. ఈ అలవాట్లు పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. స్కూల్‌కు వెళ్లే పిల్లలకు ఇంటి వద్ద తయారు చేసిన ఆహార పదార్థాలను బాక్సులో పెట్టి ఇవ్వాలి. ముఖ్యంగా తాగునీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి. తనకు నియోజకవర్గంలో మండలాల్లో సుమారు 223 వరకూ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 18742 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కానీ చాలా పాఠశాలల్లో శుభ్రమైన తాగునీరు కూడా లభించని పరిస్థితి. దీనికి తోడు అంతంత మాత్రంగా ఉన్న పారిశుద్ధ్యం తదితర సమస్యలతో చిన్నారులు రోగాల పాలు కాకుండా పాఠశాలలో ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వీధులన్నీ మురికిగా మారి అత్యంత వేగంగా వ్యాధులు వ్యాపించేందుకు అవకాశం ఉంది. పాఠశాలల వద్ద డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, పాఠశాల ప్రాంగణం అంతా చెమ్మగా మారడం, వర్షపు నీరు నిల్వ ఉండటం తదితర కారణాలతో వ్యాధులు త్వరగా సోకే అవకాశం ఉంది. వర్షంలో తడవడం వలన దగ్గు, జలుబు, డయేరియా, పలుర రకాల జ్వరాల బారిన పడే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పాటించవలసిన జాగ్రత్తలు

- సాధ్యమైనంత వరకూ కాచి చల్లార్చిన నీటినే అందరూ తాగాలి.
- పాఠశాలల్లో తాగునీటి ట్యాంకులను తరచూ శుభ్రపరచి, క్లోరినేషన్ చేయించాలి.
- తాజాగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. గిన్నెలపై ఈగలు వాలకుండా మూతలు పెట్టాలి. నిల్వ ఉంచిన ఆహారం ఆరోగ్యానికి ఎంత మాత్రం మంచిది కాదు.
- ఆహారం తినే ముందు, తరువాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
- మల, మూత్ర విసర్జన అనంతరం చేతులను సబ్బుతో కడుక్కోవాలి.
- పరిసరాల పరిశుభ్రత పాటించాలి. బహిరంగ మూత్ర, మల విసర్జన చేయకూడదు.
- డ్రెయినేజీల్లో నీరు నిల్వ ఉన్న చోట కిరోసిన్, దోమల నివారణ మందులు బ్లీచింగ్ వంటివి చల్లాలి.
- వర్షంలో తడవకుండా గొడుగు, రెయిన్ కోటు వంటి దుస్తులను ధరించాలి.
- పాఠశాలల వద్ద చెత్తాచెదారం నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి.
- పాఠశాలలో సెప్టిక్ ట్యాంక్‌ల గొట్టాలపై దోమ తెరలు, ఇనుప జల్లెడ ఏర్పాటు చేయాలి.

జాగ్రత్తలు పాటించాలి



వర్షా కాలంలో మురుగు నీరు, చెత్తాచెదారం నిల్వ ఉన్న చోట ఈగలు, దోమల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. వీటి వలన డయేరియా, మెదడువాపు, మలేరియా, డెంగీ, చికున్ గున్యా తదితర ప్రాణాంతక వ్యాధులు సోకే అవకాశం ఉంది. వర్షంలో తడవడం వలన దగ్గు, జలుబు, కలరా, పలు రకాల జ్వరాలు డయేరియా తదితర వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. పిల్లల ఆరోగ్య విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

–డాక్టర్ సాయి రెడ్డి, వైద్యాధికారి, రేలంగి

వినాయకుడికి ప్రత్యేక పూజలు



తాడేపల్లిగూడెంలో చవితి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని వినాయక చవితి ఉత్సవాల్లో మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కొలుకులూరి ధర్మరాజు తదితరులు ఉన్నారు.

మానవత సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవత సేవలు అభినందనీయమని పలువురు వక్తలు తెలిపారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో 15 మంది మునిసిపల్ కార్మికులకు ఉచితంగా రైన్ కోట్, మాస్కులు పంపిణీ చేశారు. ఎం.కే శ్యామ్ సుందర్ ఆర్థిక సహకారం అందజేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమీషనర్ యేసుబాబు మాట్లాడుతూ మానవత సేవలు ప్రతిఒక్కరూ అభినందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ అధ్యక్షుడు జి.రాజేంద్ర కుమార్, సెక్రటరీ మిరియాల కిశోర్, కోశాధికారి యర్ర ఆంజనేయులు, యెగ్గిన శరత్, చేకూరి బంగ్రారాజు, బురిడి సతీష్, హరి కుమార్, కేవీ రామారావు, కె.బాలకృష్ణ, తుమరాడ చిన్నా, పాండురంగారావు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో ప్రతిజ్ఞ దినం



జగన్నాథపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: విద్యుత్ అమరవీరుల సంస్మరణార్థం గురువారం మండలంలో జగన్నాథపురం గ్రామంలో ప్రతిజ్ఞ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకుడు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ 2000 ఆగస్టు 28వ తేదిన విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా బషీరాబాద్‌లోని ప్రదర్శనపై నాటి ప్రభుత్వం నిర్ధాక్షిణ్యంగా జరిపిన కాల్పుల్లో అమరులైన వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అదే విధానాలను అవలంభిస్తుందన్నారు. దీనిపై మరోసారి విద్యుత్ ఉద్యమానికి ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. సీపీఎం నాయకులు పీలా గాది నాయుడు, మాణిక్యాలరావు, మట్టా వెంకటేశులు, ఆరేపల్లి సూర్యప్రకాష్, కానూరు వెంకట శివ, మట్టా రంగ, సత్యప్రకాష్, ఎల్.రాజు, వెలుటూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

30న సంచార జాతుల సంఘసభ



తణుకులో కరపత్రాలు ఆవిష్కరించిన పెండ్ర వీరన్నతో సంచార జాతుల నాయకులు

తణుకు అర్బన్: ఈనెల 31వ తేదీన భారతదేశ విముక్తి సంచార జాతుల 73వ స్వతంత్ర దినోత్సవ వేడుకను పురస్కరించుకుని 30వ తేదీన భీమవరంలోని వీరమ్మ పార్కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని సంచారజాతుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న పిలుపునిచ్చారు. బుధవారం తణుకు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సంజార జాతులకు చెందిన వర్గాలను కలిశారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బొడ్డు కొండయ్య, చుండూరు నాగరాజు, పొదిలి దానయ్య, కలిదిండి పెద్దిరాజు, ఆకూడి రామారావు, వస్త్రాల శ్రీను, కావలి భవాని పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

నరసాపురం రూరల్: ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం నరసాపురం మండలం తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తొలుత పీహెచ్‌సీలోని మందులు, ల్యాబ్, స్టాఫ్ రూమును తనిఖీ చేశారు. ఓపీ రికార్డులతో పాటు సిబ్బంది హాజరు పట్టీని పరిశీలించారు. హాస్పటల్‌ను పరిశుభ్రమైన వాతావరణం లో ఉంచాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో వినాయకచవితి

- జై గణేశా.. నామస్మరణలతో మార్మోగిన తణుకు, తాడేపల్లిగూడెం
- భక్తుల తాకిడికి కిక్కిరిసిన గణనాథుడి ఆలయాలు, మండపాలు
- ఆకర్షణీయంగా గణనాథుడి ప్రతిమలు



తణుకు శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు




తాడేపల్లిగూడెం(టీఓసీ): సుబ్బారావుపేట వద్ద హైదరబాద్ విగ్రహం




వానపల్లిగూడెంలో వినాయక స్వామి



సజ్జాపురంలో లక్ష్మి గణపతి యూత్ ఆధ్వర్యంలో...



తణుకు ఆపిల్ ఆస్పత్రి వద్ద బాల గణపతి యూత్ ఆధ్వర్యంలో...



వీకర్స్‌కాలనీలో గణపతి స్వామి



తణుకు కొచ్చెర్లకోట వారి వీధిలో శ్రీలక్ష్మి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో...



పేరిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గణపతి పూజలు

తణుకు అర్బన్: వినాయకచవితి సందర్భంగా తణుకు పట్టణంలోని విఘ్నేశ్వరస్వామి ఆలయాలు, ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. తణుకు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో స్వామివారు వెండితొడుగులో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేశారు. తణుకు కొచ్చెర్లకోట వారి వీధిలో శ్రీలక్ష్మి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోను, సజ్జాపురం లక్ష్మి గణపతి యూత్ ఆధ్వర్యంలో, తణుకు ఆపిల్ ఆస్పత్రి వద్ద బాలగణపతి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల్లో స్వామి వారి భారీ ప్రతిమలు ఆకర్షణగా నిలిచాయి. మండపాలు కూడా సుందరంగా తీర్చిదిద్దడంతో భక్తులు స్వామి వార్లను చూసేందుకు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి ఇళ్లలో వినాయకవ్రతం నిర్వహించుకున్న మహిళలు తమ పిల్లలతో కలిసి సాయంత్రం ఆలయాలకు తరలివచ్చారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పట్టణం, రూరల్ మండలాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వినాయక చవితి మహోత్సవాలు సందర్భంగా రెండోవ రోజు గురువారం పట్టణంలోని గణనాథుని ఉత్సవ పందిరాలు వద్ద స్వామివార్లుకు విశేష పూజలు జరిగాయి. పిల్లలు, పెద్దలు, మహిళలు స్వామి వారిని దర్శించారు. స్థానిక రామారావుపేటలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో 24వ గణపతి నవరాత్రుల్లో పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ మురళీకృష్ణంరాజు దంపతులు తొలిపూజలు చేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక సుబ్బారావు పేటకర్రి నాగేశ్వరరావు ఆసుపత్రి వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన గణపతి శిల రూపంలో నేరుడు పండు రంగు ఆకారంతో ఆకర్షణీయంగా నిలిచింది. వీకర్స్ కాలనీ అబ్బులు కొట్టు సెంటర్ వద్ద 13.5 అడుగుల స్వామి వారి విగ్రహంనకు భక్తులచే పూజలు చేస్తున్నారు. వానపల్లి గూడెంలో 16 అడుగులు గణేష్ విగ్రహం ఏర్పాటు చేశారు.

చెరువుల్లా రహదారులు



తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం - మాధవరం రహదారిపై నిలిచిన వర్షపు నీరు



దండగర్ర - జగన్నాథపురం రహదారిపై నిలిచిన నీరు



జగన్నాథపురం ఎస్సీ ఏరియాలో సీసీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



లింగారాయుడిగూడెం - దండగర్ర రహదారి దుస్థితి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలుస్తోంది. ప్రధానంగా లింగారాయుడిగూడెం - దండగర్ర, దండగర్ర - జగన్నాథపురం, జగన్నాథపురం - మాధవరం గ్రామాలకు వెళ్లే రహదారుల చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఫిబ్రవరి నెలలో చేపట్టిన ప్యాచ్ వర్కులు సైతం నీరు నిలవడంతో గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు నిలిచి మరింత అధ్వానంగా తయారవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గడచిన 24 గంటల్లో 45.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

నరసాపురం రూరల్: రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా వ్యవహరిస్తేనే ఈ నేరాలను అదుపు చేయగలమని ఐజీ, జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా నరసాపురం రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మిమ్మల్ని భయపెట్టినా, ఆర్థిక లావాదేవీల వివరాలు ఇవ్వాలని బెదిరించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. జాతీయ రహదారులపై ప్రయాణించేటప్పుడు నిబంధనలు పాటించాలన్నారు. నేరాలు అదుపులో ఉండేందుకు వ్యాపారులు, వివిధ సంస్థలు, గృహయజమానులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలి

యలమంచిలి: మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు ఎరువులు, పురుగు మందులను సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డ్రోన్ సహాయంతో పిచికారీ చేసుకోవాలని పాలకొల్లు ప్రాంతీయ సహాయ వ్యవసాయ సంచాలకులు పలివెల మురళీకృష్ణ కోరారు. కవిటం, పోడూరు గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాఖ, ఆత్మ సంయుక్తంగా వరి ఉత్పత్తిలో సాంకేతిక పరిజ్ఞానం అనే అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్ సహాయంతో పిచికారి చేయడం వలన సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. అదే విధంగా సిఫారసు చేసిన ఎరువులను మోతాదు వరకు మాత్రమే చల్లాలన్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడి సాధించాలని ఆయన కోరారు . ఉండి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ మల్లిఖార్జున్ మాట్లాడుతూ పురుగు మందులు విచక్షణా రహితంగా వినియోగించరాదన్నారు. ప్రస్తుతం పైరుకు పెద్దగా పురుగులు ఏమి ఆశించలేదని రైతులు తొందరపడి పురుగు మందులు పిచికారీ చేసి ఖర్చు పెంచుకోవద్దని చెప్పారు. మండల వ్యవసాయాధికారి ఎం.విశ్వాసరావు మాట్లాడుతూ రైతులు అందరూ పంట నమోదు చేయించుకోవాలని, పీఎంఎఫ్‌బీవై ఇన్సూరెన్ ప్రీమియం రూ. 210 కట్టుకోవాలని కోరారు.

స్మార్ట్ మీటర్లు వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఇరగవరం: కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ భారాలను తగ్గించాలని సీపీఎం మండల కన్వీనర్ కామన మునిస్వామి డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యమ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా గురువారం ఇరగవరం మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి కోటేశ్వరరావు, పేచ్చేటి నాగేశ్వరరావు పిల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో మరో పోరాటానికి సిద్ధం కావాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా మరో విద్యుత్ పోరాటానికి సన్నద్ధం కావాలని సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మండల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. విద్యుత్ అమరవీరుల 25వ సంస్మరణ సభ గురువారం పట్టణంలో నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ పోరాటం నిర్వహించి నేటికి 25 సంవత్సరాలు పూర్తి అయ్యిందన్నారు. నాడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ షరుతులకు తలొగ్గి రాష్ట్ర ప్రజలపై విద్యుత్ సంస్కరణలు భారాన్ని తీసుకువచ్చారని, దానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాలు పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాయని తెలిపారు. అదాని స్మార్ట్ మీటర్లు కారణంగా విద్యుత్ భారాలు మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి స్ఫూర్తితో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని ప్రతిజ్ఞ చేశారు.